ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

సోమవారం 29 జూలై 2024

5



ఎల్ఆర్ఎస్..

- పెండింగ్ దరఖాస్తులకు క్లియరెన్స్‌కు ప్రభుత్వం కసరత్తు
- పరిష్కారం కోసం జిల్లాకో ప్రత్యేక బృందం
- మానుకోటలో 25 వేల పైచిలుకు అప్లికేషన్లు పెండింగ్
- సర్కారు నిర్ణయంపై లబ్ధిదారుల హర్షం

మహబూబాబాద్ టౌన్, జూలై 28 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) పథకంలో మునిసిపాలిటీల్లోని పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న అప్లికేషన్లను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతో పాటు కొత్తగా అప్లికేషన్ పెట్టుకునేలా అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తు చేస్తోంది. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రతీ జిల్లాకొక అధికారుల బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది. అందుకు హైదరాబాద్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే అధికారులతో సమావేశమై సమీక్షించారు.

మునిసిపాలిటీల్లో సరిపోను సిబ్బంది లేకుంటే అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకోవాలని మంత్రులను సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంతో అటు దరఖాస్తుదారులకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్న ఆలోచనతో సర్కార్ అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించింది. దీంతో ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం లభిస్తోందని దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2015లో మొట్టమెదటి సారిగా..

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల పరిధిలో అక్రమ లే-అవుట్‌లు పెరిగిపోతున్నాయని గుర్తించిన మున్సిపల్‌శాఖ, వాటిని క్రమబద్ధీకరించు కునే ఎల్ఆర్ఎస్‌ను తెరపైకి తెచ్చింది. స్వరాష్ట్రం సిద్ధించాక 2015లో మొట్టమొదటిసారిగా అక్రమ లే-అవుట్‌లను ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులైజేషన్‌కు అవకాశాన్ని కల్పించింది. అప్పట్లో పెద్ద ఎత్తున స్పందన లభించింది. మార్చి 2015 నుంచి జిల్లాలో ఉన్న ఏకైక మహబూబాబాద్ మునిసిపాలిటీలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ ఆరంభించారు. 31డిసెంబర్ 2016 నాటికి ఈ స్కీంను చివరితేదీగా ముగించారు. తొలుత ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకునే వారితో రూ.10 వేల చొప్పున బ్యాంకుల్లో మునిసిపల్ కమిషనర్ పేరిట డీడీలు తీయించారు. ఆపై ఆయా భూముల విస్తీర్ణాన్ని బట్టి ఇంకా ఎన్ని వేల రూపాయలు చెల్లించాలో స్వయంగా సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆ భూమి పరిశీలించడం, భూమి కొలతలు, నలుదిశల ఉన్నవారి అభ్యంతరాలను పరిశీలించాక ఖరారు చేసి ఆ మిగిలిన పైకాన్ని తిరిగి డీడీల రూపంగా మునిసిపాలిటీకి చెల్లించాక ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇచ్చే ప్రక్రియను చేపట్టారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ ఆగిపోయింది.

తిరిగి 2020 ఆగస్టులో కొత్త జీవోను తీసుకువచ్చారు. ఇందుకు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకునే వారు రూ.1000 డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. పలు కారణాలతో అది కూడా జరగకపోవడంతో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం 2022లో మరో జీవోను తీసుకువచ్చి క్రమబద్ధీకరణకు వెసులు బాటు కల్పించింది. ఇలా ఏదో ఒక రూపేణ ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు అభ్యంతరాలు రావడంతో రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై దృష్టి సారించింది. అయినప్పటికి కదలిక లేకపోవడంతో తాజాగా కసరత్తులు చేసి, అధికారులచే జిల్లాకొక టీంను ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన చేసి పెండింగ్ దరఖాస్తును క్లియర్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో..

మహబూబాబాద్ జిల్లాలో నాలుగు మునిసిపాలిటీ పరిధిలో 25 వేల పైచిలుకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మానుకోట మునిసిపాలిటీ పాతది కాగా, 2018 ఆగస్టు మాసంలో కొత్తగా తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో మొత్తంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 12,194 రాగా, అందులో 109 పరిష్కరించగా 54 దరఖాస్తులను తిరస్కరించారు. ఇక తొర్రూరు మునిసిపాలిటీలో 1,0348 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మరిపెడలో 2,524 దరఖాస్తులు రాగా, రెండు నుంచి మూడు దరఖాస్తులు పరిష్కరించగా మిగతావి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక డోర్నకల్ పరిధిలో 855 దరఖాస్తులు రాగా 432 పరిష్కరించగా 423 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటన్నింటికి త్వరలో మోక్షం లభించనుంది. రాష్ట్రప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై తీసుకున్న నిర్ణయంపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ
- ఈ సీజన్ నుంచే మొదలు పెట్టే ఆలోచన
- త్వరలో మార్గదర్శకాలు జారీ
- అప్రమత్తమవుతున్న వ్యసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు

వివరాలు : 7లో..

మత్స్యకార్మికులు ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



కార్మికులకు ఐడీ కార్డులను అందజేస్తున్న కోరం కనకయ్య

గార్ల జూలై28 : రాష్ట్రప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటుతో గ్రామాల్లో గిరిజన సొసైటీల మత్స్యకార్మికులు ఐకమత్యంతో ఉంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పుల్లూరు జీపీ సూర్య తండా మత్స్యకార్మికులకు జిల్లా సొసైటీ అధికారులు జారీ చేసిన 70 మందికి ఐడీ కార్డులను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టగానే గ్రామంలోని చెరువులకు, కుంటలకు జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేపపిల్లలను అందజేస్తామన్నారు. కార్మికుల సంక్షేమం కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతను అందించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీల బానోత్ మంజుల, సర్పంచ్‌లు బానోత్ రాంబాయి, ప్రవళిక, సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, హరినాయక్, కృష్ణ, మత్స్యసొసైటీ చైర్మన్ జి.కిషన్, లింగాల నగేష్, నెల్లూరి శ్రీను, రవినాయక్, జాటోత్ రమేష్, జగదీష్‌రెడ్డి డి.రామారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

- బీజేపీ, బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి
- గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్



బెల్లయ్యనాయక్ సన్మానసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్



సన్మానసభలో మాట్లాడుతున్న తేజావత్ బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 28 : కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలోని అన్నివర్గాలకు సముచిత న్యాయం దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. మహబూబాబాద్ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తేజావత్ బెల్లయ్యనాయక్-సుజాత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానగ్రహీత ఆయన మాట్లాడారు. తెలంగాణ గత పదేళ్లుగా బీఆర్ఎస్ నియంతృత్వ పాలన సాగించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని.. ప్రజలంతా స్వేచ్ఛగా ఉన్నారని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ 300 సీట్లు గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో 17,056 కోట్లు గిరిజన సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. గత బీఆర్ఎస్ హయంలో 2019-20, 20-21 ఆర్థిక సంవత్సరంలో ట్రైకార్‌కు ఒక్కపైసా నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీమంత్రి కేటీఆర్ మేడిగడలో కుంగని పిల్లర్ వద్దకు వెళ్లి మాట్లాడుతున్నారని 7వ బ్లాక్‌లోని కుంగిన 16వ పిల్లర్ దగ్గరకు ఎందుకుపోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలను తిప్ప కొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్రఅధికారప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, మాజీ జడ్పీటీసీ జెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, అర్బన్‌అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, గుగులోతు దస్రూనాయక్, ఎస్టీ సెల్‌కో-ఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్, రమేష్‌చందర్‌రెడ్డి, దేవరం ప్రకాశ్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, భూక్య రవి, రామగోని రాజు, భూక్య శ్రీను, గుగ్గిళ్ల వీరయ్య, కొండ్ర ఎల్లయ్య, రాజేందర్, లింగాల వీరభద్రం, రాంచంద్రు, పేరం వీరస్వామి, శివ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మేలు జరిగేలా పోరాటాలు..

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

రాష్ట్రంలో గిరిజనులకుమేలు జరిగేలా బెల్లయ్యనాయక్ అనేక పోరాటాలు నిర్వహించారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఉద్యమ కెరటంగా ఎదిగారని చెప్పారు. పేద కుటుంబంలో జన్మించిన బెల్లయ్యనాయక్ అంచెలంచెలుగా ఎదిగి, ఉన్నతస్థానాలకు చేరుకున్నారని తెలిపారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీతో కలిసి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్‌జోడో యాత్రలో పాల్గొన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ఎండగడుతూ తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు.

అనారోగ్యంతో వార్డు కౌన్సిలర్ మృతి



మాచర్ల ప్రవంతి (ఫైల్)

మరిపెడ, జూలై28 : అనారోగ్యంతో మరిపెడ మునిసిపల్ నాలుగో వార్డు కౌన్సిలర్ మాచర్ల ప్రవంతి (35) ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. ప్రవంతి గతకొంతకాలంగా అస్తమాతో బాధపడుతుంది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి అక్కడి డాక్టర్లు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రవంతి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డం వెంకన్న, పలువురు వార్డు కౌన్సిలర్లు వేర్వేరుగా ప్రవంతి మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. రోదిస్తున్న కుటుంబసభ్యులను వారు ఓదార్చారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య



బానోత్ శ్రీను (ఫైల్)

గార్ల, జూలై 28 : శేరిపురంలో జీపీ చవిటితండాలో మోటార్ సైకిల్ ఫైనాన్స్ విషయంలో భార్య భర్తను మందలించిందని భర్త ఈనెల 25న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. చిన్నబంజర గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్ (23) చవిటితండాకు చెందిన ధరావత్ సుమతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరి ఇరువురు బతుకుదేరువు కోసం చవితండాలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోగా, వారికి ఓపాప జన్మించింది. జీవనోపాధి కోసం భర్య స్వగ్రామమైన చవిటితండాలో సుతారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో భార్యకు తెలియకుండా శ్రీనివాస్ ఫైనాన్స్‌లో మోటార్ సైకిల్ కొనుగోలు చేశాడు. దీంతో భార్య గొడవ చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురై, కూలీపనికి పోతున్నానని చెప్పి మార్గమధ్యలో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన బాటసారులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి, గార్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం శ్రీనివాస్ మృతి చెందాడు. బానోత్ హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.



పెద్దనాగారంలో అంధుడు నాగన్నకు నిర్మించిన నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

అంధుడి కుటుంబంలో వెలుగు నింపిన 'ఖాకీ'

- దీనస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి బాసట
- పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

వివరాలు 6లో..

నేషనల్ కన్స్యూమర్ కమిషన్ జిల్లా చైర్మన్‌గా రాజ్‌కుమార్



మహబూబాబాద్ టౌన్, జూలై 28 : నేషనల్ కన్స్యూమర్ కమిషన్ జిల్లా చైర్మన్‌గా మహబూబాబాద్ పట్టణ శివారు హనుమంతుడిగడ్డకు చెందిన మంగలంపల్లి రాజ్‌కుమార్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని సారస్వతప్రదేశ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. అనంతరం జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన రాజ్‌కుమార్‌కు జాతీయ చైర్మన్ ఎంపీఎల్ నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ నలమాస శ్రీకాంత్‌గౌడ్‌కు రాజ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కన్స్యూమర్స్ రైట్స్ గూర్చి ప్రజలకు అవగాహన కల్పిస్తానని స్పష్టం చేశారు.

జిల్లాలో 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 28 : జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం కొద్దిపాటి వర్షం కురిసింది. మహబూబాబాద్, బయ్యారం, కురవి, మరిపెడ, నెల్లికుదురు, డోర్నకల్, తొర్రూరు మండలాల్లో కొద్దిపేపు వాన పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 5.6, గంగారంలో 8.2, బయ్యారంలో 5.4, గార్లలో 5.8, డోర్నకల్‌లో 7.4, కురవిలో 0.6, మహబూబాబాద్‌లో 3.8, గూడూరులో 5.2, కేసముద్రంలో 2.6, నెల్లికుదురులో 1.2, చిన్నగూడూరులో 4.0, మరిపెడలో 1.4, తొర్రూరులో 1.4, పెద్దవంగరలో 3.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

బోనమెత్తిన ఎంపీ రవిచంద్ర



హైదరాబాద్ లాలుదర్వాజ నల్ల పోచమ్మకు బోనమెత్తి, మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఇనుగుర్తి, జూలై 28 : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలోని లాలుదర్వాజ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లాలు దర్వాజ మేకలబండలో కొలువైన నల్లపోచమ్మ బోనాలు సందర్భంగా బోనమెత్తి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం బోనాల పండుగ అని, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పంటలు బాగాపండి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బోనాల జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ, నవీన్, ప్రవీణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

బొగత హోరు.. పర్యాటకుల జోరు

- జలపాతం సందర్శన పునఃప్రారంభం



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

వాజేడు, జూలై 28 : ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి కనిపించింది. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సందర్శనను ఆరు రోజులపాటు నిలిపివేసిన అటవీశాఖ అధికారులు ఆదివారం పునఃప్రారంభించారు. ఈ నెల 23న వరంగల్‌కు చెందిన యువకుడు జలపాతంలో గల్లంతై మృతి చెందడం, వరద ఉధృతి ఎక్కువగా ఉంటడంతో ఆంక్షలు విధించారు. వాటిని ఎత్తివేయడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈతకొలనులోకి మాత్రం అనుమతి లేదని ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. చుట్టూ పచ్చని కొండల నడుమ నుంచి జాలువారుతున్న జలపాతం అందాలను చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు.

జలపాతం వద్ద పోలీసు రక్షణ

బొగత జలపాతం వద్ద జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా పోలీసులు రంగంలోకి దిగారు. పర్యాటకుల రద్దీ ఎక్కువ ఉండే రోజుల్లో పోలీసులు ప్రత్యేక దుస్తుల్లో జలపాతం వద్ద గస్తీ నిర్వహించనున్నట్లు ఎస్సై హరీశ్ తెలిపారు. ఆదివారం జలపాతం వద్ద పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. జలపాతం వద్ద ఆకతాయిలు, మద్యం సేవించి, వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు.

అంధుడి కుటుంబంలో 'ఖాకీ' వెలుగులు

● దీనస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి బాసట ● పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



నూతన ఇంటి ముందు ఎస్పీ సుధీర్‌రాంనాథ్

నర్సింహులపేట, జూలై 28 : దీనస్థితిలో ఉన్న ఓ అంధుని కుటుంబంలో పోలీసులు వెలుగును నింపారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారి సూచన మేరకు స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ తన సిబ్బందితో కలిసి కొందరు దాతల ఆర్థిక సాకారంతో నూతన ఇల్లు నిర్మించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్సింహుల పేట మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన నిరుపేద అంధుడు మందుల నాగన్న పాటలు పాడుతూ వచ్చిన కొద్దోగొప్పో డబ్బుతో తన కుటుంబాన్ని సాకుతున్నాడు. పుట్టుకతోనే అంధుడు కావడంతో తనకు తోడుగా వచ్చే తల్లి బక్కమ్మ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికావడంతో పాటు తను ఉండే ఇల్లు శిథిలావస్థకు చేరిందన్న విషయం స్థానిక పోలీసుల ద్వారా జిల్లాపోలీస్ అధికారికి చేరింది. వెంటనే స్పందించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అంధుని కుటుంబానికి అండగా ఉంటానని, దాతలు ముందుకు వచ్చేలా చొర వ తీసుకోవాలని ఎస్సై సతీష్‌కు సూచించారు. ఎస్పీ సూచనల మేరకు ఎస్సై సతీష్ సిబ్బందితో అంధుడి ఇంటికి చేరుకున్న అతని దీనస్థితిని చూసి చలిం చి, తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు ఇచ్చాడు. గూడు నిర్మించేలా సహకారం అందిస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చాడు. మండలానికి చెందిన కొందరు దాతలు జినుకల రమేశ్, ఉల్లి శ్రీను, శ్రీరాం శేషయ్య, నలమాస రాజు, దాసరోజు రాజశేఖర్‌తో పాటు మరికొందరి సహకారంతో సుమారు రూ.2.50 లక్షలతో రెండుగదుల ఇంటి నిర్మాణాన్ని 20 రోజుల వ్యవధిలోనే చేపట్టారు. ఆ నూతన గృహాన్ని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదివారం ప్రారంభించి, అంధుడు నాగన్నకు తల్లి బక్కమ్మకు నూతన వస్త్రాలను అందజేశారు. ఇంటి ఆవరణలో మామిడి మొక్కను నాటారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే ఉపేక్షించం..

జిల్లాలో గుడుంబా, నల్లబెల్లం, గాంజా లాంటి అక్రమవ్యాపారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు శాంతి భద్రతల నిర్వహణతో పాటు సమాజంలో సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. పనితీరును బట్టే పోస్టింగ్‌లు, రివార్డులు ఉంటాయన్నారు. జిల్లాలో నల్లబెల్లం, నాటుసారా పూర్తిస్థాయి నివారణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. పోలీసుల పనితీరును బట్టే సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయన్నారు. జిల్లా పరిధిలో ఉన్న రహదారులపై రోడ్డుప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం పరిధిలో యూనిట్‌గా ఏర్పడి ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పెంచుకోవాలన్నారు. మత్తు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. నిరుపేద అంధుడు నాగన్న నూతన ఇంటి నిర్మాణానికి ప్రత్యేక చొరవతీసుకున్న ఎస్సై సతీష్‌ను, సిబ్బందిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, దాసరోజు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, శేరి రామకృష్ణ, శ్రీరాంశేషయ్య, ఉల్లి శ్రీను, నలమాస రాజు పాల్గొన్నారు.



మౌన దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కాళోజీ జంక్షన్, జూలై 28: పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సభకు వందలాదిగా పెన్షనర్లు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల పెన్షనర్ల సమావేశం జరిగింది. దీనికి నర్సింహారెడ్డి అధ్యక్షత వహించగా, పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల కరువు భత్యం వాయిదాలను విడుదల చేయాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ధర్నాచౌక్ వద్ద నిర్వహించే మౌన దీక్ష కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 150 మంది పెన్షనర్లు పాల్గొనే విధంగా సంఘాల బాధ్యులు కృషి చేయాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన 25మంది, స్పెషల్ టీచర్ల పక్షాన 20మంది మౌనదీక్షకు హాజరవుతామని నాగపురి సారయ్య, పెద్దొరి పెద్దన్న, సుధాకర్‌లు ప్రకటించడాన్ని సమావేశం స్వాగతించింది. చివరగా మౌన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 28: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఏషియన్ మాల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ స్కూల్ సమీపంలో ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన ప్రకారం.. సుబేదారి ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని విచారించగా ఒకరు ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన విద్యార్థి చౌలం దొరబాబు, మరొకరు కమలాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మంత్రి సంజయ్‌కుమార్ అని తెలిసినట్లు చెప్పారు. వీరిద్దరూ గంజాయికి బానిసై ఒడిషా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి హనుమకొండలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్



పట్టుబడిన జేసీబీలు, టిప్పర్‌ను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, జూలై 28: మండలంలో రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన ప్రకారం... లింగమోరిగూడెంలో నిల్వచేసిన మట్టితో కూడిన ఇసుకను అనుమతి లేకుండా జేసీబీ ద్వారా లోడింగ్ చేస్తుండగా పట్టుపడింది. అదేవిధంగా పున్నేలు శివారు వడ్డెరిగూడెంలో అనుమతి తీసుకోకుండా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా జేసీబీ, టిప్పర్ పట్టుపడ్డాయి. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండుగ్రామాల్లో 100 కాల్ ఆధారంగా వెంటనే స్పందించి ఇసుక, మొరం అక్రమ రవాణాను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

రూ. 2లక్షల 30వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 28 : గంగారం మండలం పెద్దఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి తనకు తెలియకుండా రూ. 2లక్షల 30 వేలు మాయం కావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఎల్లాపూర్‌కు చెందిన గుండగాని శ్రీధర్ ఖాతా నుంచి రూ. 2 లక్షల 30 వేలు డ్రా కావడంతో సైబర్ నేరగాళ్లు తన ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అనుమానాస్పద లింకులపై టచ్ చేయొద్దని, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని ఎస్సై సూచించారు.

నేటి నుంచి దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీలు

వరంగల్ కల్చరల్, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. సోమవారం బదిలీల ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈనెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది, వివిధ హోదాలు గ్రేడ్‌లలో ఉన్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. బదిలీల ప్రక్రియల నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈవోలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈవోలు శనివారం రాత్రి హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణను కలిశారు. దాదాపు 125మంది ఈవోలు ఆర్‌జేసీని కలిశారు. బదిలీల ప్రక్రియ విషయంపై చర్చించినట్లు తెలిసింది. అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జూలై 31తో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానచలనం కలగనుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 200కుపైగా ఆలయాలు ఉండగా వరంగల్ జిల్లాలో 60కిపైగా దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉన్నాయి. నగరంలో 25కు పైగా ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయానికి ఇప్పటి వరకు మూడు నుంచి నలుగురు సిబ్బంది అవసరం ఉండగా ఒక్కరితోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఈవోలు, సిబ్బంది కొరత

ఒక్కో ఆలయానికి నలుగురు సిబ్బంది నాలుగో గ్రేడ్ ఉద్యోగులతోపాటు స్వీపర్, వాచ్‌మెన్‌లు ఉండాలి. వీరితోపాటు ఈవో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది కొరతతోపాటు ఈవోల కొరత కూడా ఉంది. ఒక్కొక్క ఈవోకు నాలుగు నుంచి ఐదు దేవాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. దీనికి తోడు ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులు అసలు విధులే సరిగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 28: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓఆర్‌ఆర్‌పై ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు చెట్ల పొదల మధ్య గంజాయి సేవిస్తూ కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఖానాపురానికి చెందిన పి.రాజేష్, పి.అనిల్, ఎల్లాయిగూడెంకు చెందిన విపిన్ కుమార్‌గా గుర్తించారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



అరెస్టు అయిన ముగ్గురు యువకులు

కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ
- అప్రమత్తమవుతున్న వ్యవసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు



హనుమకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయి. ఈ వానాకాలం పంటల నుంచే కౌలు రైతులకూ పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కౌలుదారులకు రైతు భరోసా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై మార్గదర్శకాలను త్వరలోనే రూపొందిస్తామని తెలిపింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. అధికారులు కూడా ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చే పనిలో నమగ్నమయ్యారు.

ఎకరాకు రూ.20వేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 4,78,562 మంది ఉన్నారు. వీరికి ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు తమకున్న కొద్దిపాటి భూమితో పాటు పక్కనున్న ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఫలితంగా వీళ్లు కూడా సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. దేవాదుల ఎత్తిపోతల, ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ ఆయకట్టు, ఇతర ప్రధాన రిజర్వాయర్లు, పెద్ద చెరువుల కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.20వేలను భూమి సొంతదారులకు చెల్లిస్తున్నారు. కాలువలు, కుంటలు, బోరు బావులు కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరానికి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు.

అప్పుల ఊబిలో..

వర్షాధార పంటల్లో ఇతర పంటలతో పోల్చితే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపుతున్నారు. పంట చేతికి వచ్చినా, రాకపోయినా కౌలును మాత్రం చెల్లించాల్సిందే. కౌలుతోపాటు పెట్టుబడులు పెట్టి పంటలు పండించడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలేమి వర్తించవు. బ్యాంకుల నుంచి కనీసం రుణాలు కూడా అందవు. అప్పులు చేసి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. ప్రకృతి వైపరిత్యాలవల్ల పంట నష్టపోతే పరిహారం కూడా అందదు, అధిక వడ్డీ భారంతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రైతు భరోసాలో భాగంగా కౌలు డబ్బులు చెల్లిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

గతంలో ప్రకటించి..

2014కు ముందు అప్పటి ప్రభుత్వాలు కౌలు రైతులకు అధీకృత కార్డులు పంపిణీ చేశాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ కార్డులు పని చేయడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన కర్షకులకు రైతు బంధు పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌలు రైతులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. అధిక వడ్డీకి అప్పులు చేసి పంట ఉత్పత్తులను తిరిగి అదే వ్యాపారులు అమ్ముకోవాల్సి రావడంతో కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

మార్గదర్శకాలు ఎప్పుడో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనేదానిపై స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాలోని మూడు లక్షలుపైగా కౌలు రైతులు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఏటా హనుమకొండ జిల్లాలో 1.40 లక్షలు, వరంగల్ జిల్లాలో 2.50 లక్షలు, జనగామ జిల్లాలో 1.68 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.21 లక్షలు, ములుగు జిల్లాలో 1.10 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఇప్పటివరకు కౌలు రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మొదలైన కసరత్తు

కౌలు రైతులకు రైతు భరోసా అమలు దృష్ట్యా తాజాగా జిల్లాల వారీగా ఎంత విస్తీర్ణంలో వారు పంటలు పండిస్తున్నారో ఆరా తీస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు సాగవుతున్నాయనే వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికే పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రాత పూర్వక ఆదేశాలు అందగానే కౌలురైతుల వివరాలు సమర్పిస్తామని ఉమ్మడి ఇల్లాలోని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నిరాకరణ

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో భూము యజమానులు కలవరపడుతున్నారు. కౌలు రైతులకు పత్రాలు రాసిచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసిస్తే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమౌతామోనని భూయజమానులు భయపడుతున్నారు. ఒక వేళ కౌలు రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇచ్చినట్లయితే కౌలు మొత్తాన్ని పెంచే యోచనలో ఉన్నారు. కాగా, గుర్తింపునకు ప్రామాణికమైన కౌలు పత్రాలు లేకపోతే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమవుతాయని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

కౌలు రైతులు 3 లక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. 10.50 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో పట్టాదారు 9.50 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల సుమారు లక్ష మందికి ఇప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 3 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. వీరిలో చాలామంది 3 నుంచి 5 ఎకరాల వరకు భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించుకుంటున్నారు. వీరిలో 2 నుంచి 3 ఎకరాలు కౌలు తీసుకొన్నవారే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.



మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

కమ్మ కులస్థులకు దాన గుణం ఎక్కువ

న్యూశాయంపేట, జూలై28: కమ్మ కులస్థులకు దాన గుణం కలవారని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఫౌండర్, చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్‌లో ఆషాడమాస వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జెట్టి కుసుమకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమ్మ కులస్థులు ఐక్యంగా ఉండాలన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా ప్రపంచంలో కమ్మ కులస్థులు ఎక్కడ ఉన్నా ఒక్క దగ్గర చేర్చి కులాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకెళదామన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కూచిపూడి నృత్యం, భరతనాట్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మాదాల కాశయ్య, పూర్వ అధ్యక్షుడు మాందాటి కోటేశ్వర్‌రావు, కమ్మం సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారెడ్డి, పట్టాభిరామయ్య, నరేష్, రామచందర్‌రావు, కూనాటి హరిబాబు, వెంకటేశ్వర్లు, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, రాంబాబు, అనిల్‌కుమార్‌తోపాటు పెద్ద సంఖ్యలో కమ్మ కులస్థులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాముల షైడి, గునిగంటి రమేష్‌లను ఏకగ్రీంగా ఎంపిక చేసినట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఆదివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన 8వ డివిజన్ కుమార్‌పల్లిలోని న్యూలయోలా హైస్కూల్‌లో రాష్ట్ర కమిటీ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల పక్రియ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్యతో పాటు సీనియర్ న్యాయవాదులు షైదం జయపాల్, చేపూరి విజయ ముఖ్య అతిథిలుగా హాజరు కాగా, జిల్లా కమిటీలో పోటీ లేకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా చేపూరి విజయ, అధ్యక్షుడిగా శ్రీరాముల షైడి, ప్రధాన కార్యదర్శిగా గునిగంటి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల రవి, పీసరి రజిత, రుద్రారపు హేమలత, జిల్లా కార్యదర్శులుగా ఎం.డి. హసీనా బేగం, తరాల సమ్మక్క, తరాల శంకర్, ప్రచార కార్యదర్శులుగా ఎం.డి. షహీదా బేగం, గుగులోతు సోనమ్మ, కార్యవర్గసభ్యులుగా భూక్యా అనసూర్య, బానాల మరియా, బోగి రాకేష్, సూడిద మహేందర్, బరిగెల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సాంబయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క బిక్షపతి, కార్యదర్శి పార్నంది రమేష్‌చంద్ర, రాష్ట్ర నాయకులు కొంగర సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి

బాలసముద్రం, జూలై 28: వివాహాది శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు వినియోగించుకోవాలని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. వరంగల్-1 డిపో నుంచి అద్దె ప్రాతిపదికన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడప్లస్ విహారయాత్రల కోసం 9959226047, 7382855793 నంబర్లను సంప్రదించాలని డీఎం మోహన్‌రావు అన్నారు.

సాహిత్యం సమాజ మార్గనిర్దేశనం చేయాలి..

గ్రంథావిష్కరణలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, జూలై 28: సాహిత్యం సార్వజనీనమైనదని, ఏ ప్రక్రియలో సాహిత్యం స్పృశించినా అది సమాజ మార్గనిర్దేశనం చేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని ఎలక్ట్రిసిటీ భవన్‌లో ఆచార్య బన్నా ఐలయ్య అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో వెటర్నరీ వైద్యుడు కాయిత వెంకటి కలం నుంచి జాలువారిన 7వ గ్రంథం నేను నా జీవిత ప్రస్థానాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన అనుభవాన్ని రంగరించి తన జీవితానుభవంలో ఎదురైన అనేక సంఘటనలు పాఠకులకు అనుకూలంగా ఆసక్తిగా మలచి రేపటి తరాలు ఆదర్శంగా తీసుకునేలా రాసిన రచయితను అభినందించారు. ప్రముఖ రచయిత్రి అరుణకీర్తి పతాక కరాజుల గ్రంథాన్ని సమీక్షిస్తూ దళితుల సమీక్షపై అనేక ఆసక్తికర సంఘటనలను అద్భుతంగా మలచి పాఠకులకు చేరువైనారని అన్నారు. కొన్ని సంఘటనల ఆధారంగా మలిచిన గేయాన్ని వినిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ హరినాథ్‌రావు, నిధి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, తదితరప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు అరసం వరంగల్ కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో సాహిత్య అభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

- ఐక్య విద్యార్థి సంఘాల నేతల వెల్లడి
- కేయూ వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం



ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూక్యాంపస్, జూలై 28: ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేసే విద్యా వ్యాపారాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాల నాయకులపై యజమానులు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఐక్య విద్యార్థిసంఘాల నేతలు హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు, ఒకే బ్రాంచ్‌కి అనుమతి పొంది అనేక బ్రాంచ్‌లు నిర్వహించడం, ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని డిమాండ్ చేశామని చెప్పారు. తమ అగడాలు బహిర్గతమవుతున్నాయనే అక్కసుతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హనుమకొండ కలెక్టర్‌కు తమపై వినతి పత్రాన్ని ఇవ్వడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై పోరాటం చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. నిజాయితీగా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుస్తున్న కళాశాలల యాజమాన్యాలు తమతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ భవిష్యత్ కార్యాచరణ సోమవారం ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు రోహిత్, ఏబీఎస్‌ఎఫ్ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భరత్, ప్రణయ్, బీఎస్‌ఎఫ్ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఇష్టారాజ్యం



- నగరంలో గల్లీకొకటి చొప్పున వందలాది హాస్టళ్ల ఏర్పాటు
- అనుమతులు, నిబంధనలు లేకుండా నిర్వహణ
- కలుషిత వాతావరణం, నాసిరకం భోజనంతో విద్యార్థుల అవస్థలు
- కొన్ని చోట్ల వ్యభిచారం, నేరాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారులు, పోలీసులు దృష్టి పెట్టాలని వినతులు

హనుమకొండ టౌన్, జూలై 28: హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్ల హవా నడుస్తోంది. కొంతమంది అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా హాస్టళ్లను ఏర్పాటు చేసి వ్యాపారంగా మలుచుకుంటున్నారు. హనుమకొండ నయీంనగర్, హంటర్‌రోడ్డు, చౌరస్తా, ములుగురోడ్డు, భీమారం, వరంగల్ రంగంపేట, పోచమ్మమైదాన్, పోస్టాఫీసు, రంగశాయిపేట, బొల్లికుంట, కాజీపేట, నిట్ ప్రాంతాల్లో కళాశాలలను అడ్డాగా చేసుకొని వందలాది హాస్టళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎలాంటి అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రమాణాలు కరువు

ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వరంగల్ నగరానికి చదువులు, ఉద్యోగాలు, వివిధ పనుల కోసం చాలామంది వస్తుంటారు. సొంతంగా రూమ్‌లు తీసుకుని ఉండడం భారమైన వారు.. ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయిస్తుంటారు. అక్కడ నిర్వాహకులు చెప్పిన ఫీజును చెల్లించి ఉంటున్నారు. అయితే అదే అదునుగా భావించిన కొంత మంది నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులే పరమావధిగా భావిస్తూ ఎవరు వచ్చినా హాస్టల్‌లో చేర్చుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అడ్మిషన్ తీసుకున్న వారు ఇచ్చిన చిరునామా నిజమైనదేనా? అనేది చూడరు. ప్రైవేటు హాస్టల్‌లో మెయింటెనెన్స్ రిజిస్టర్ కనిపించదు. హాస్టల్‌లో దేని కోసం ఉంటున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంటున్నారు? పక్కవారితో ఎలా ప్రవర్తిసున్నారు? రోజూ రాత్రి హాస్టల్‌లో ఉంటున్నారా? లేదా? అనేదానిపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా లేడీస్ హాస్టల్స్ వద్ద రక్షణ లేకుండా పోయింది. వాచ్‌మెన్‌లను నియమించడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోరు. ఫైర్ సెఫ్టీ ఉండదు. కేవలం నాలుగు గదుల ఇల్లు దొరికితే చాలు.. తెల్లారేకల్లా హాస్టల్ అంటూ బోర్డు పెట్టి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్లలోనే నిర్వాహకులు నివాసం ఉంటుండడంతో శుభకార్యాలు, మందుపార్టీలు చేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలున్నాయి. కొన్ని హాస్టళ్లను అనుకొని లాడ్జీలు నెలకొల్పబడ్డాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

నగరంలోని ప్రైవేటు హాస్టళ్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ ఆహారం ఎలా తయారు చేస్తున్నారు? శుభ్రత పాటిస్తున్నారా? అనే దానిపై అధికారులు ఏనాడూ పరిశీలించిన పాపాన పోలేదు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రైవేట్ వసతి గృహాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేయగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కుళ్లిపోయిన కూరగాయలు, శుభ్రతలేని కిచెన్, కలుషితమైన నీరు.. ఇలా రకరకాల సమస్యలు బయటపడ్డాయి. అదే తరహాలో వరంగల్ నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులతో పాటు మునిసిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న అక్రమాలు, నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది రెండు, అంత కన్నా ఎక్కువ హాస్టళ్ల నిర్వహిస్తున్నారని, అలాంటి వారు రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాంటి వారిపై దృష్టిసారించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

కొన్ని సంఘటనలు

- ఒక మహిళ వివాహం చేసుకొని భర్తను వదిలిపెట్టి హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌లో ఉంటూనే బయట వేరే గది కిరాయి తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోంది. విటుడు దొరికినప్పుడు రూమ్‌లో గడిపి వస్తుంటుంది. ఈ క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేయగా మహిళను అదుపులోకి తీసుకొని వదిలేశారు. మహిళ ఒక్కరే ఈ వ్యభిచారంలో పాల్గొనేదా..? హాస్టల్లో ఉన్న అమ్మాయిలకు డబ్బు ఎరవేసి ఈ రొంపిలోకి దింపిందా? అనేదానిపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.
- నయీంనగర్ పెద్దమోరీ సమీపంలో హాస్టల్‌లో ఉంటూ ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ మహిళ స్నానం చేస్తున్నప్పుడు హాస్టల్ నిర్వాహకుడు బాత్‌రూమ్‌లోకి చొరబడి లొంగదీసుకున్నాడు. దాన్ని ఆసరాగా చేసుకొని లైంగికంగా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- కోరుట్లకు చెందిన ఇద్దరు అమ్మాయిలు స్వలింగ సంపర్కులుగా మారి హాస్టల్‌లోనే కాపురం పెట్టారు. నిత్యం రూమ్‌లోకి పోయి తలుపులు పెట్టుకోవడం.. ఇద్దరు కలిసి స్నానం చేయడంతో పాటు అందరిముందే అసభ్యకంగా ప్రవర్తిస్తుండటంతో పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించి హాస్టల్‌ను ఖాళీ చేయించారు.
- ఓ హాస్టల్‌లో అసౌకర్యాలతోపాటు ఫీజులపై ప్రశ్నించిన యువతిని హాస్టల్ అసోసియేషన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నిర్వాహకుడు ఇష్టానుసారంగా దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- కిషన్‌పురలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న డిగ్రీ విద్యార్థిని ప్రతీ రోజు రాత్రి బయటికి వెళ్లి తిరిగి ఉదయం హాస్టల్‌కు చేరుకుంటోంది. రోజూ అదే పనిగా వెళ్లి వస్తుండటంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకుపోగా బాయ్‌ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.
- నయీంనగర్ రంగ్‌బార్ సమీపంలో గర్ల్స్, బాయ్స్ హాస్టల్స్ పక్కపక్కనే ఉండటంతో వెకిలిచేష్టలు, అసభ్య ప్రవర్తన చేయడంతో గర్ల్స్ హాస్టల్ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడితోపాటు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెటీరియల్ రిలీజ్‌కు ఈ-స్టోర్ విధానం

హనుమకొండ టౌన్, జూలై 28: వినియోగదారులకు సత్వరమే సేవలందించడంలో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్‌లో కొత్తగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వరంగల్ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఈ మొదటగా ఒక పనికి కావల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో లేదో సాప్(ఎస్‌ఏపీ)సాఫ్ట్‌వేర్‌లో, ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్‌ను రిజర్వు చేసుకుంటారని పేర్కొన్నారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్‌కు సంబంధించిన సమాచారం ఎస్‌ఏపీ వర్క్‌ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళుతుందని తెలిపారు. మెటీరియల్ తీసుకోవడానికి ఏ రోజు రావాలో తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, ఎస్‌ఏపీ మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని వివరించారు. తెలియజేసిన తేదీ సమయానికి స్టోర్‌కు వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దీనిలో పేపర్ ప్రస్థావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టక ముందు కావాల్సిన మెటీరియల్ లిస్టును ప్రింట్ తీసుకొని సంతకాలు తీసుకొని ఆ పేపర్ సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవల్సి ఉండేదని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికే ఈ-స్టోర్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఏపీ టీం చేశారని తెలిపారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు 24గంటల పాటు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఎస్‌ఈ మధుసూదన్‌రావు తెలిపారు.

'ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడాలి'

కురవి, జూలై 28 : ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం మండల నాయకుడు మాలోతు కిషన్‌నాయక్ కోరారు. కురవి, కం దికొండ గ్రామాల్లో ఆదివారం జరిగిన శాఖ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కమ్యూ నిస్టులు బలపడితేనే నిరుపేదల సమస్యలు పరిష్కారమవుతాయని, కమ్యూనిస్టు పార్టీ లను ఆదరించాలన్నారు. ఈ సమావేశాల్లో సీపీఎం నాయకులు కట్ల భిక్షం, ఆమెడ నాగ య్య, బానోత్ సీతారాంనాయక్, గుండగిరి జ్యోతిబసు, పద్మ, కోనేటి స్వామి, కర్నె రాములు, లింగయ్య పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు


వీరభద్రుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కురవి, జూలై 28 : శ్రీవీరభద్ర స్వామి దేవాలయంలో మహబూబా బాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయ క్-ఉమా దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరభద్రస్వామి ఆలయంలో పూజలు జరిపిన అనంతరం భద్రకాళి ఆలయంలో మొక్కులు తీర్చుకు న్నారు. అనంతరం నూతన కారుకు పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, జూలై28 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ముడుపుగల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముడుపుగల్‌కు చెందిన నలమాస నాగేశ్వర్‌రావు (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా డు. ఇటీవల నాగేశ్వర్‌రావు మద్యానికి బానిసై ఏ పనిచేయకుండా ఉండడంతో భార్య పద్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నాగేశ్వర్‌రావు శనివారం రాత్రి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నాగేశ్వర్‌రావును చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

మానుకోట పట్టణ శివారులో చోరీ

● తులం బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

మహబూబాబాద్ రూరల్, జూలై 28 : జిల్లా కేంద్రం శివారు ఏబీ ఫంక్షన్‌హాల్ సమీపంలోని నివాస గృహంలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. టౌన్ ఎస్సై విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్‌హాల్ సమీపంలోని సతీశ్ శనివారం రాత్రి మూడు రూము లకు తాళాలు వేసి, మరో గదిలో కుటుంబసభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారుజామున లేచి చూసే సరికి గదులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండడంతో వెంటనే బీరువాను పరిశీలించింది. బీరువా పగులగొట్టి అందులో ఉన్న తులం బంగారం, 7తులాల వెండి ఆభరణాలు, ట్యాబ్‌ను అపహరించుకు పోయినట్లు గుర్తించింది. దీంతో వెంటనే ఈ విషయాన్ని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కెట్ దడువాయి సంఘం ఎన్నిక


అశోక్ కార్యదర్శి ఉప్పలయ్య అధ్యక్షుడు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 28 : మహబూబా బాద్ వ్యవసాయ మార్కెట్ దడువాయి సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా వింతల ఉప్పలయ్య, ప్రధాన కార్యద ర్శిగా వీరు అశోక్‌ను ఎన్నుకున్నారు. మహబూబాబాద్ వ్య వసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నరసాని సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దడువాయి సంఘం ఎన్నికలు జరిగాయి. దడువాయి సం ఘం గౌరవ అధ్యక్షు డిగా రాష్ట్ర దడువాయి సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఇస్రావత్ దస్రు, ఉపాధ్యక్షులుగా మానావత్ మంగీలాల్, సహాయ కార్యదర్శిగా జిల్లీ రమేష్, కార్యవర్గ సభ్యులుగా దీల్లీ రాజు, నిమ్మల కరుణాకర్‌రెడ్డితో పాటు గౌరవ సలహాదారు లుగా జనార్దన్, మాధవ్‌ను ఎన్నుకున్నారు.

మనుభాకర్ కాంస్యపతకం సాధించడం హర్షణీయం

● మా అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 28 : ప్యారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్ క్రీడల్లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనుభాకర్ కాంస్యపతకం సాధించడం హర్షనీయమని మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా)అధ్య క్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం ఆదివారం తెలిపారు. ఒలంపిక్స్ క్రీడల్లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన మనుభాకర్ మొదటి పతకం సాధించి భారతదేశం కీర్తి ప్రతిష్ఠలను నమోదు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

'ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

దోర్నకల్, జూలై 28 : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కరీమాపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యురాలు రాజ్యలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోర్నకల్ మండల యూటీఎఫ్‌శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు జుట్టు పెంచుకుని పాఠశాలకు వచ్చారని, వారికి ఎన్నిసార్లు హెయిర్ కటింగ్ చేయించుకుని శుభ్రంగా పాఠశాలకు రావాలని చెప్పినప్పటికీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి స్పందన లేదని చెప్పారు. దీంతో మిగతా విద్యార్థులకు ఆసౌకర్యం కలుగకుండా భావించిన ఉపాధ్యాయురాలు కరీమా విద్యార్థుల జుట్టును స్వయంగా కట్ చేశారని చెప్పారు. ఈ విషయంపై విచారణ జరపకుండ ఏకపక్షంగా ఆమెను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులు ఎండీ అబ్దుల్‌అజీజ్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కాసుమారెడ్డి, శ్యామల, మాలతి, అమీన, రేణుక, రాజేశ్వరి, నామ వెంకటేశ్వర్లు, వివేక్, సోమనబోయిన శ్రీను, సాహెబ్‌అలీ, అమీన్, శంకర్, చంద్రశేఖర్, రాములు, బుచ్చయ్య, సీతార ములు, నాగరాజు, సీతారామారావు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

● టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

తొర్రూరు, జూలై 28 : ఉద్యోగ విధుల నిర్వహించిన ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజ న్ కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల న్నారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే శరణ్యమని, విద్యారంగ సమస్యల పరిష్కారా నికి ప్రభుత్వంపై పోరాడేందుకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన రాజ సుకన్య దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో నాయ కులు బుచ్చయ్య, శ్రీశైలం, విష్ణువర్ధన్, ఉపేందర్‌రెడ్డి, కొలు పుల శ్రీనివాస్, సైదులు, కిషన్ నాయక్, సురేందర్, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

దీనస్థితిలో సంక్షేమ హాస్టళ్లు

● కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జన్న లచ్చయ్య


ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేవీపీఎస్ నేత లచ్చయ్య

మరిపెడ, జూలై 28 : సంక్షేమ హాస్టళ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేడు అవి దీనస్థితిలో ఉన్నాయ ని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జన్న లచ్చయ్య ఆరో పించారు. ఆదివారం ఆ సంఘం చేపట్టిన సర్వేలో భాగంగా లచ్చయ్య స్థానిక కేవీపీఎస్ నేతలతో కలిసి మరి పెడ బంగ్లాలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి హాస్టల్ లోని వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లా డారు. విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడంలేదన్నారు. టాయిలెట్స్ అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోవటం లేదని వాపోయారు. మెనూ అమలు లేదన్నారు. తాగునీరు అశుభ్రంగా ఉన్నట్లు సర్వేలో తేలిందని చెప్పారు. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు హాస్టళ్లను సందర్శించి విద్యా ర్థులకు వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశా రు. కేవీపీఎస్ స్థానిక నాయకులు వెంకటేష్, వినయ్, వికాస్ పాల్గొన్నారు.

'ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వాలి'


కాలనీతండా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

కేసముద్రం, జూలై 28 : మండలం లోని మహమూద్‌పట్నం కాలనీతండా వద్ద ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి ఇంటి నిర్మాణాలను అధికారులు అడ్డుకుంటు న్నారని ఆరోపిస్తూ ఆదివారం లబ్ధిదా రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లా డుతూ కేసముద్రంస్టేషన్, విలేజ్, భూక్యా రాంతండాలకు చెందిన 42 మందికి ఇళ్ల స్థలాలకు పట్టాలను గతప్రభుత్వంలో ఇచ్చారని తెలిపారు. ఈ స్థలాల్లో ఇంటి నిర్మాణాలను చేస్తోంటే కొంతమంది ఓర్వలేక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో అధికా రులు తమ ఇళ్ల నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపి వేశారని తెలిపారు. నిర్మాణాలను నిలిపివేయడంవల్ల తాము తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో భూక్యా రమేష్, జాటోత్ యాకూబ్, వెంకన్న, వాల్యా, బోడ విజేందర్, వాంకుడోత్ వెంకన్న, బొజ్జ లకావత్ నరేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న రాజేశ్వర్‌రావు

తొర్రూరు, జూలై 28 : గృహ నిర్మాణ కంపెనీలో ఒప్పందం మేరకు ఇల్లు కొనుగోలు చేయగా అద నంగా డబ్బులు చెల్లించా లని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొరుతూ నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన రాజేశ్వర్ రావు ఆదివారం తొర్రూరు డివిజన్ కేం ద్రంలో జిల్లా వినియోగదారుల సమాఖ్య ఇన్‌చార్జ్ వెనుదాటోతు వినతిపత్రం అందించారు. వరంగల్‌లోని ఓ గృహ నిర్మాణ కంపెనీలో రూ.56 లక్షలకు ఒప్పందం మేరకు కొనుగోలు చేశానని, రూ.24 లక్షలు చెల్లించగా, సంస్థ రాజేశ్వర్ రావుకు ఇంటి నిర్మాణం పూర్తి చేసి అప్పగించింది. రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా అగ్రిమెంట్ కంటే అదనంగా డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అదనపు డబ్బులు చెల్లిస్తేనే రిజిస్ట్రేష న్ చేస్తామని తిరకాసు పెట్టడంతో వినియోగదారుల సమాఖ్యను ఆశ్రయించామన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న రజిత

ఉద్యోగులు లక్ష్యాలను సాధించాలి

● సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజిత

తొర్రూరు, జూలై 28 : ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యో గులు, ఆర్టీసీ యాజమాన్యం సంస్థ అభివృద్ధి కోసం విధించిన లక్ష్యాలను సాధించాలని సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజిత అన్నారు. ఆదివారం ఐస్పెక్ట్ ఆపర ఐలో డ్రైవర్లు, కండక్టర్లకు కేఎంపీఎల్ పెంపు, అదనపు ఆదాయం తీసుకువచ్చేందుకు తగు సూచనలు చేశారు. వచ్చే శ్రావణ మాసంలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు సిబ్బంది కృషి చేయాలని పిలుపుని చ్చారు. ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణమని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలుపులపై చెక్కిన మంత్రి సీతక్క చిత్రాలు



కొత్తగూడ, జూలై 28 : సాధారణంగా ఇంటి తలుపులపై దేవుళ్ల చిత్ర పటాలు చెక్కించుకుం టారు కాని పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క ఓ అభిమాని తన ఇంటి తలుపులపై ఆమె చిత్రా లు చెక్కించారు. మండ లంలోని వేలుబెల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చింత సారయ్య వ్యక్తిగతంగా మంత్రి సీతక్కకు అభి మాని. తన స్వగ్రామం గంగారం మండలం మడగూడ గ్రామంలోని నూతనంగా ఇంటిని నిర్మించుకుంటున్నా డు. సీతక్క మీద అభిమానంతో తన ఇంటి ద్వారాలకు అమర్చే తలుపులపై ఆమె చిత్రాలు చెక్కించుకున్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

గార్ల, జూలై 28 : మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో పిచ్చి మొక్కలను తొలగించి మరమ్మతు చేయించి ప్రజావసరాలకు ఉపయోగించాలని అం బేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు జంజాల సంపత్ అధికారులను కోరారు. 2006లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లా పరిషత్ నిధు లు రూ.2.50 లక్షలతో నిర్మించిన భవనానికి అలనా పాలన లేక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుం దన్నారు. పిచ్చిమొక్కలను తొలగించి, ప్రజావసరాలకు ఉపయోగించాలన్నారు.

పాఠశాలలో బోనాల సందడి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 28 : జిల్లా కేంద్రంలోని లండన్ కిడ్స్ పాఠశాలలో చిన్నారులు బోనా లతో సందడి చేశారు. స్థానిక పాఠశాలలో ఆదివారం బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బూర తరుణ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు పూర్ణచందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సైకి శుభాకాంక్షలు


ఎస్సైని సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొత్తగూడ, జూలై 28 : నూతనంగా బా ధ్యతలు స్వీకరిం చిన ఎస్సై కుశకు మార్‌ను ఆదివా రం విశ్వబ్రాహ్మ ణులు, ఆటో యూనియన్ నాయకులు కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ఎస్సైని కలిసిన వారిలో మాజీవైస్ ఎంపీపీ పులి యాదగిరి, విశ్వబ్రాహ్మణులు కట్లోజు వెం కట నారాయణరావు, కలకం రవీంద్రచారి, కలకం రాజు, కల్లూరి కృష్ణ, కుర్మిళ్ల రాజు, ఆటో యూనియన్ నాయ కులుఅఫ్జల్, రాజన్న, సాంబయ్య, కుమారస్వామి, గజే ష్, మొగిలి, శివ, బాలు, రమేష్, భార్గవ్.

బీఆర్ఎస్ నేత హరీందర్‌రెడ్డి మృతి

● పలువురు పరామర్శ

సీరోలు, జూలై28 : మండలంలోని చింతపల్లి గ్రామా నికి చెందిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సీనియర్ నాయకుడు మల్లు హరీందర్‌రెడ్డి (64) ఈనెల 27న మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరా బాద్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీ లకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హైదరా బాద్‌లోని ఆయన నివాసంకు చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో ఎంపీ డీకే.అరుణ, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ మాజీమంత్రి సత్యవతిరా థోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు ఖమ్మం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు ఉన్నారు. మృతుడు హరీందర్‌ రెడ్డికి భార్య యశశ్రీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


మల్లు హరీందర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



ఇనుగుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇనుగుర్తి, జూలై 28 : ఇనుగుర్తి నూతన మండలంగా ఏర్పడి సంవత్సరం కావస్తున్నప్పటికీ ఇక్కడ అన్ని ప్రభుత్వశాఖల కార్యాలయాలు లేక మండల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంగా ఆవిష్కృతమైనా ఇనుగుర్తిలో కేవలం తహసీల్దార్ కార్యాలయం మాత్రమే ఉంది. ఉన్న ఒక్క తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ లేక ధ్రువీకరణ పత్రాల కోసం, ఇతర పనుల కోసం వచ్చే ప్రజలు పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం మండల తహసీల్దార్‌కు ఇనుగుర్తి మండలం తహసీల్దార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడంతో అతను ఎప్పుడో.. వస్తాడో..? ఎప్పుడు వెళ్తాడో తెలి యక ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షిస్తు న్నారు. ఇప్పటికైనా ఇనుగుర్తికి రెగ్యులర్ తహసీల్దార్‌ను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇతర శాఖలైన పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, వ్యవసాయ లాంటి ఇతరశాఖలు లేకపోవడంతో ఇటు ఇనుగుర్తి గ్రామంలో విలీనమైన గ్రామాల ప్రజలు అటు నెల్లికుదురు, ఇటు కేసముద్రం కార్యా లయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఇనుగుర్తి మండల కేంద్రం లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యకోసం విద్యార్థుల ప్రయాణ కష్టాలు

● రోడ్డు బాగాలేదని బస్ రద్దు చేస్తున్న టీఎస్ ఆర్టీసీ

● వృథా అవుతున్న బస్‌పాస్‌లు

కొత్తగూడ, జూలై 28 : విద్యను నేర్చుకునేందుకు విద్యార్థులు ప్రయాణ కష్టాలు పడుతున్నారు. వర్షం కురిసిందంటే బస్ సర్వీస్ రద్దుచేస్తున్న ఆర్టీసీ. పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు తీసుకున్న బస్‌పాస్ వృథా అవుతుందని విద్యా ర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల లేకపోవడంతో కొత్తగూడ, కొత్తపల్లి, గుం జేడు, గాంధీనగర్ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు పొగుళ్లపల్లి జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో చేరారు. పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ జారీ చేసిన బస్‌పాస్‌లను తీసుకున్నారు. వర్షం పడితే కొత్తపల్లి, పొగుళ్లపల్లి మధ్య రోడ్డు బాగా లేదని ఆర్టీసీ బస్ సౌకర్యం రద్దు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు కాలినడకన, సైకిళ్లపై, ప్రైవేటు వాహనాల్లో వెళుతున్నారు. విద్యార్థులు చదువుకునేందుకు ప్రయాణకష్టాలు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.


పొగుళ్లపల్లి పాఠశాల నుంచి కొత్తపల్లికి నడచి వస్తున్న విద్యార్థులు



కేసముద్రంలో మాట్లాడుతున్న జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్

కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

● సంఘం మండల అధ్యక్షుడు మంగీలాల్

కేసముద్రం, జూలై 28 :గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికులకు నెలకు రూ.26వేల వేతనాన్ని ఇవ్వాలని జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్ డిమాండ్ చేశారు. కేసముద్రం అంబేద్కర్ విజ్ఞాన భవనంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లా డుతూ జీపీ కార్మికులకు ఉద్యోగభద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, సకాలం లో వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు కార్మి కులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, టీకుల శ్రీనివాస్, బీర్ల కనకలక్ష్మి, లింగా దపు యాకయ్య, కొంగర కవిత, తేళ్ల సుజాత, సగురం సుమలత, దుర్గం వెంకన్న, తేళ్ల సంజీవ, వి.లలిత పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని 30న చలో హైదరాబాద్

మహబూబాబాద్ టౌన్, జూలై 28 : అనేక సంవత్సరాలుగా సంవత్సరా లుగా ప్రజానీకానికి వైద్యసేవలందిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30నచలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియ న్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి తెలిపారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆదివారం ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజ రైన మాధవి మాట్లాడుతూ..రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, పేదలకు వైద్యసేవలను అందిస్తూ వారికి ఆరోగ్యభద్రత కల్పిస్తున్నారని చెప్పారు. 30న జరిగే చలో హైదరాబా ద్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక..

మహబూబాబాద్‌లో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశ అనంతరం 33 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవా ధ్యక్షుడిగా కుంట ఉపేందర్, అధ్యక్షురాలిగా మంకిని రమణ, ప్రధానకార్యద ర్శిగా పద్దకంటి ఉపేంద్ర, కోశాధికారిగా కొప్పెర సుజాత, ఉపాధ్యక్షులుగా విజయ, జ్యోతి, జయసుధ, సహాయ కార్యదర్శులుగా శ్రీలత, రమణ, జ్యోతి లను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● 16న దాడి చేసి గాయపర్చిన వీధి కుక్కలు

టేకుమట్ల(భూపాలపల్లి జిల్లా), జూలై 28 : కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రామకిష్టాపూర్ (వీ)లో నివసిస్తున్న ఆకుమారి చంద్రమ్మ (64)పై ఈనెల 16న వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ... వరం గల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆమె ఆది వారం తెల్లవారు జామున మృతి చెందింది.

యూట్యూబ్ సహాయంతో స్కేటింగ్ శిక్షణ


● సెల్ఫ్ లెర్నింగ్‌తో బాలుడి ప్రతిభ

● కేసముద్రం రోడ్లపై తిరుగుతున్న బాలుడు


కేసముద్రంలో స్కేటింగ్ చేస్తున్న బాలుడు అఖిల్

కేసముద్రం, జూలై 28 : పాదాలకు చక్రాల మా దిరిని స్కేటింగ్ నేర్చుకో వడం అంటే పెద్దపట్టణాల్లోనే అందు బాటులో ఉంటుంది. సాధారణంగా స్కే టింగ్ నేర్చుకోవాలని పిల్లల్లో చాలా ఆసక్తి ఉంటుంది. అయితే కేసము ద్రంలో ఈ శిక్షణ అందుబాటులో లేక పోవడంతో యూట్యూబ్ సహాయంతో స్కేటింగ్ నేర్చుకుంటున్నాడో బాలుడు. ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన దరావత్ భీమా కుమారుడు అఖిల్ కొద్దిరోజులుగా ఇక్కడి రోడ్లపై స్కేటింగ్ చేస్తున్నాడు. కేసముద్రం, ఉప్పరపల్లి గ్రామాల మధ్యనున్న సన్నటి బీటీరోడ్డుపై స్కేటింగ్ చేసుకుంటూ వెళుతుండడంతో ఈ బాలున్ని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. తనకు స్కేటింగ్ అంటే ఇష్టమని అందుకే ఆన్‌లైన్ లో రూ.ఎనిమిది వేలు వెచ్చించి స్కేటింగ్ షూ, బేతలకు, క్యాప్, హెల్మెట్ తెప్పించుకున్నట్లు తెలిపాడు. తొలుత చక్రాల షూతో నిలబడడమే సాధ్యం కాలే దని చెప్పాడు. యూట్యూబ్‌లో స్కేటింగ్ శిక్షణ వీడియోలను చూసి సాధన చేసినట్లు తెలిపాడు. ఇప్పుడు ప్రతీరోజు మూడు నుంచి ఐదు కిలోమీటర్లు రోడ్డుపై చక్రాల షూతో జారుకుంటూ వెళుతున్నట్లు తెలిపాడు. ఏదిఏమైనా నేర్చుకోవాలనే పట్టుదల ఉంటే అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను ఉపయోగించుకొని సాధన చేయవచ్చని ఈ బాలుడు నిరూపిస్తున్నాడు.

మురళీచారి మృతి తీరని లోటు


మురళీచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబాబాద్‌టౌన్, జూలై 28 : నిత్యం సమస్యల పరిష్కా రం కోసం పోరాడే మాజీ కౌన్సిలర్ మురళీచారి మృతి ప్రజాఉద్య మాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. మహబూ బాబాద్ పట్టణ శివారు గిరిప్రసా ద్‌నగర్ కాలనీలో సీపీఎం ఆధ్వ ర్యంలో మురళీచారి సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ఆకుల రాజు మాట్లాడుతూ సీపీఎం పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన మురళీచారి ప్రజాఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే వారని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాట పథంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావులరాజు, నమ్మెట రాజమౌళి, హేమానాయక్, బీసీల యాకన్న, కుమ్మరి కుంట్ల నాగన్న, ఎర్ర శ్రీను, బానోత్ వెంకన్న, లింగన్న, నలమాస వెంకన్న, గణేష్, సీతారాములు, వీరన్న, రజాక్, గునూకర్ పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన నేషనల్ టూరిస్టు గైడ్స్

వెంకటాపూర్ (రామప్ప), జూలై28 : మండలంలోని రామప్ప రామలిం గేశ్వర దేవాలయాన్ని నేషనల్ టూరిస్ట్ గైడ్స్ ఆదివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నందీశ్వరుడి ముఖ్య ప్రదక్షిణలు చేసి కోర్కెలు తీరాలని కొలిచారు. అనంతరం దేవాలయ శిల్ప సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని తమ కెమెరాల్లో బంధించుకున్నారు. ఈ బృందంలో నేషనల్ టూరిస్ట్ గైడ్స్ జయచంద్రన్, జయరాజ్, అజయ్‌కుమార్, ఆయుష్‌కుమార్, జోజెన్, పాక్సిల్, జోస్వో, అలెక్స్, సుకంద, నాగసుబ్రహ్మణ్యా తదితరులు ఉన్నారు.